# అక్షరం

నిన్నటినుంచీ ముసురుగానే ఉంది.

ఇవ్వాళ పొద్దుటినుంచీ సన్నగా జల్లు పడుతోంది.

గుడిసెముందు చితచితగా ఉంది. రిక్షావాడి బ్రతుకులా గుడిసెలోపల నేలంతా చిత్తడి, చిత్తడిగా వుంది.

సాయంత్రానికి రిక్షావాని చేతులో వెక్కిరించే నాలుగు రాళ్ళలా గుడిసె కప్పులోంచి అక్కడ ఇక్కడ ఓ చినుకు రాలుతోంది.

పొయ్యిలో కాలని తుమ్మ కొమ్మల్నీ; కడుపులో కాల్తున్న ఎండిపోయిన ఎముకల్నీ తిట్టుకుంటోంది గంగమ్మ.

లోకంలోని నిరక్షరాస్యతలా- గుడిసె అంతా కమ్మేసింది పొగ.

గంగమ్మ కళ్ళకీ పొగకీ నేస్తం కుదిరి ఎన్నేళ్ళయిందో తెలీదుగానీ, ఇవ్వాళ మాత్రం - గంగమ్మ పాలిట శత్రువుగా మారింది పొగ. పైగా, గెరిల్లాల సతాయిస్తోంది.

అందుకే, గంగమ్మ కళ్ళు సన్నగా జల్లు కురుస్తున్నై.

గంజి చట్టిని పొయ్యిమీదనుంచి దించి బయటికి వచ్చింది గంగమ్మ. చెంగుతో కళ్ళొత్తుకుంది.

ఎదురుగా - హనుమంతు.

గుడిసెముందు రావిచెట్టు కింద కూర్చొని, రాతి ముక్కతో తిన్నెమీద ఏవో బరుకుతున్నాడు.

జల్లు పలచబడుతోంది. వానకు తడిసిన మట్టి వింత వాసనల్ని వెదజల్లుతోంది. క్వార్టర్స్ ముందు తోటల్లోని బంతి పూల పచ్చదనం వాతావరణంలో కనిపిస్తోంది. క్వార్టర్స్‌ను చుట్టేసిన కొండల అంచులమీద వింతవింత ఆకాశ చిత్రాలు కదలాడుతున్నై - హనుమంతుని మనసులోని కోరికల్లా.

గంగమ్మ హనుమంతు దగ్గరగా వచ్చింది "ఏందిరా- ఈడనే కూకున్నావ్, మీ అయ్య సెంటర్ కాడికి రమ్మన్నాడుగా" అంది వాడితో.

రంగయ్య రిక్షా వేసుకువెళ్తూ, హనుమంతుని సెంటర్‌కు పంపితే నూకలకు డబ్బులిస్తానని చెప్పి పోయాడు. అప్పటికి ఒకటి రెండు గిరాకీలు తగుల్తాయనే ఆశతో.

హనుమంతు తలెత్తి తల్లి మొహం కేసి చూశాడు.

గంగమ్మ చూపులు తిన్నె మీదికి మర్రలినై. అంతా ఏదో చెక్కినట్టుంది. అది రాతో, గీతో, అర్థముకాదు ఆమెకి. "ఏందిరా యియన్నీ?" అడిగింది. "ఒంట్లేస్తన్నా, నిన్న రాజు సెప్పాడు-

పదిదాంకా" అన్నాడు హనుమంతు. వాడి కళ్ళల్లో గోచరిస్తున్న 'యురేకా - పిలుపుల్ని' – చదువుకోగలిగిన శక్తి గంగమ్మకు లేదు

"నీకియ్యాల తన్నులు తప్పవులే" అంటూ వెనక్కివెళ్ళి గుడిసె తలుపులాగి, దానికున్న పురికొసని గుంజకు కట్టి మళ్ళీ చెట్టు కిందికి వచ్చింది.

"నేనెల్తన్నా. మీ అయ్యొస్తే - సెట్టిగారింటికెల్లానని సెప్పు. మినువులు బాగు సెయ్యాలంట. మీ ఇద్దరు గంజి తాగండి" అంటూ ముందుకు సాగింది.

గంగమ్మకి కొడుకుని తలచుకుంటే సంతోషమూ కలుగుతుంది; అప్పుడప్పుడూ విచారము కలుగుతుంది. హనుమంతుకి పన్నెండేళ్ళు. గత రెండేళ్ళనుండీ వాడు గంగమ్మకి సమస్యగానే తయారైనాడు. రోజూ ప్రొద్దున లేస్తానే "నే బల్లోకెల్తానే - సదుకుంటా" అంటాడు. అప్పుడప్పుడు "పలక్కొని పెట్టమ్మా" అంటూ మారాం చేస్తాడు. ఎదురుగా క్వార్టర్స్‌లో పిల్లలు బూట్లూ, కొత్త బట్టలూ వేసికొని, చేతుల్లో పెట్టెలతో రిక్షాలోకి ఎక్కుతూ ఉండే - వాళ్ళందర్నీ, కన్నార్పకుండా చూస్తూ రావి చెట్టుక్రింద నిలబడతాడు. ఈ దినచర్యలో కొత్త ఏమీ లేదు. చూడాల్సిందీ లేదు. అయినా సమయానికి తక్కువ అనుకోకుండానే అలా వచ్చి నిలబడతాడు. రిక్షాలు కదిలిపోతాయ్. పిల్లలు కేరింతలు కొడ్తూ, చేతులు వూపుతూ వుంటారు. వాళ్ళ తల్లులూ, తండ్రులూ వాళ్ళకి "టా...టా" చెప్తూ నిలుచుండిపోతారు.

కొద్దిసేపటికి - ఉత్సాహంగా గుడిసెలో కొస్తాడు హనుమంతు. "నేను అట్టా బడికెల్తానే" అంటాడు - దివిటీలా వెలుగుతున్న మొహంతో.

వాడి అయ్య రంగయ్య- దీనికి సుతరామూ వొప్పుకోడు. ఒకటి రెండుసార్లు భర్తను కదిపిచూసింది గంగమ్మ. "సదు వెందుకే - సంకనాకను ఆ పెద్దమేడలో కారున్న అయ్యగారి కొడుకు సూడు సదూకొని ఆమెరికా ఎల్లొచ్చిండు. కాపీ డబ్బులు సంపాయించలేడు. హనుమంతు గాడికీ ఎదవ బుద్ధులు నేర్పమాక" అన్నాడు రంగయ్య.

ఇంకో వెన్నెలరాత్రి- గుడిసె బయట హనుమంతు నిద్ర పోతున్నాడు. లోపలికొచ్చి పెళ్ళాంతో సరసం మొదలుపెట్టాడు రంగయ్య. ఇదే అదననుకొని రోజు రోజుకు ఖర్చులు ఎక్కు వవుతున్నాయనీ, సంపాదన సాలడంలేదనీ, ఎన్నాళ్ళిలా దిగనాసి సంసారం చేస్తామనీ - చెప్పుకుంటూ పోయింది. గంగమ్మ మాటలు రంగయ్యలోను ఆలోచన కలిగించసాగేయి. చెమ్మగిలివ కండ్లకు వర్షంలా కనిపించింది- భవిష్యత్తు. ఇద్దరిలోనూ బతుకు భయం తొంగిచూసి, గుండెల్ని వెచ్చగా హత్తుకొనేట్టు చేసింది.

సరిగ్గా ఆ సమయంలో గోముగా అడిగింది గంగమ్మ "అడ్ని బల్లో ఏద్దాం" అని. పాముమీద కాలు వేయబోయిన వాడిలా అదిరిపడ్డాడు రంగయ్య. ఒక్కసారి నీరసం ఆవహిం చింది. క్షణంలో మొహాన్న చెమటపట్టింది. నవనాడులూ క్రుంగి పోయినట్టయింది. కోపమొచ్చింది, లేచి నించున్నాడు. "ఈమాట

మళ్లీ అన్నావంటే నీతోలు తీస్తా - జాగ్రత్త, సదువు పిచ్చి నీకు బాగానే పట్టిందే " అంటూ మిడతలదండులా పెళ్ళాంమీద దాడి చేసాడు. అరుస్తూనే గుడిసె బయటకి వెళ్ళి హనుమంతు పక్కన పడుకున్నాడు.

ఆ తర్వాత హనుమంతు అప్పుడప్పుడు తన పాట తాను చెప్పుచెప్తున్నా - గంగమ్మ మాత్రం తనకైన అనుభవాల దృష్ట్యా భర్త దగ్గర ఆ ప్రసక్తి తేవడం మానేసింది.

హనుమంతు నెమ్మదిగా ఎదురింటి రాజుతో జత కలిపేడు. రాజు తండ్రి బ్యాంక్‌లో పనిచేస్తాడు క్వార్టర్స్‌లో కాపురం. హనుమంతుకి అప్పుడప్పుడు సాయంకాలాల్లో అక్షరాలూ, ఒంట్లూ నేర్పడం మొదలెట్టాడు రాజు. హనుమంతు వాటిని సాధన చేయసాగాడు.

ఇవ్వాళా అట్టాగే ఒంట్లేస్తూ కూర్చున్నాడు హనుమంతు.

పన్నెండు గంటలవుతుండగా వచ్చేడు రంగయ్య. "ఏరా, సెంటర్ కాడికి రాలేదేం"- అడిగేడు హనుమంతుని. హనుమంతు అప్పటికి గంజి తాగేసి గుడిసెలో నులక కుక్కిలో పడుకొని వాడి కలల్లో వాడు తేలిపోతున్నాడు. తండ్రి మాట విని 'కాలికి నొవ్వగా వుంది' అని మరోవైపు తిరిగి పడుకొన్నాడు. 'మీయమ్మేది?' - ఈ ప్రశ్న - తండ్రి సౌమ్యంగా వున్నట్టు ధైర్యం కల్గించింది హనుమంతుకి.

హనుమంతు లేచి కూర్చున్నాడు. తల్లి సెట్టి గారింట్లో మినుములు బాగుచేయడానికి పోయినట్టు చెప్పాడు.

రంగయ్య గంజి తాగడం మొదలెట్టాడు. "నువ్వొచ్చేంతే డబ్బులిచ్చేవాణ్ణిగా, ఇయ్యాల నూకలు కొనాలి."

దీనితో అయ్యకాడ డబ్బులున్నట్టు అర్థం చేసికున్నాడు హనుమంతు. మంచం దిగి నెమ్మదిగా తండ్రి దగ్గరగా వచ్చి కూర్చొన్నాడు. తండ్రి గంజి తాగుతూ, ఆవకాయ ముక్కని చీకుతుంటే- తను నీళ్ళు నమిలేడు; ఉమ్మి మింగేడు. ధైర్యం కూడగట్టుకొని అడిగేడు; 'అయ్యా...నే బడికెల్తానే' అని.

తక్కున తలెత్తి కొడుకుకేసి చూసేడు రంగయ్య. తలవంచుకొని బిక్కుబిక్కుమంటూ నేలమీద పిచ్చిగీతలు గీస్తున్నాడు హనుమంతు.

"సంపేస్తా మల్లీ - బడీగిడీ అన్నావంటే జాగ్రత్త" అంటూ గ్రుడ్లురిమి, కంచంలోనే చెయ్యి కడుక్కున్నాడు రంగయ్య.

తండ్రి సౌమ్యంగా వున్నాడనుకున్న తన అంచనా తలక్రిందయినందుకు, ఆయన సమాధానంలోని కాఠిన్యానికి చిన్నబుచ్చుకొని, మొహం మెల్లిగాదించేసికొని అక్కణ్ణుంచి లేచిపోయాడు హనుమంతు.

నులకకుక్కిలో వాలేడు రంగయ్య. కొడుకు అభ్యర్థన రంగయ్యని గతంలోకి తోసింది.

రంగయ్య తండ్రి దొరదగ్గర పాలేరుగా పనిచేసేవాడు. "దొరది దొడ్డమనసు" అంటూ వుండేవాడు తండ్రి. రంగయ్యకి ఏళ్ళు వస్తున్నకొద్దీ అతనికో బెడద ఏర్పడింది. దొరకి పిల్లలు

లేకపోవడం కారణమో, నిజంగానే ఆయన మనసు దొడ్డది కావడం కారణమో- రంగయ్యకు తెలీదు గానీ- అతన్ని బడిలో వెయ్యమని దొర రంగయ్య తండ్రికి సలహా యిచ్చేట్ట.

ఓ మంచి రోజున - 'నువ్ బడికెళ్తన్నావ్ యియ్యాల నుంచీ' అన్నాడు తండ్రి. రంగయ్యకి తల్లిలేదు. అతన్ని కని ఆమె పోయింది. నాయనమ్మ పెంపకం. ఆవిడా అన్నది, 'పాలేరు కొడుకుని పనిలోకి దింపమనకుండా ఆ దొరగారు నిన్ను బడికెయ్యమనడం - నీ అదురుట్టంరా రంగా. బాగా సదూకో' అని.

మైలుదూరంలో పక్క వూళ్ళో వుంది బడి. చద్దన్నా లయ్యాక—డొంక బట్టి పోవడం, చింతకాయలు కోసుకుతింటూనో నేరేడు కాయలేరుకు తింటూనో — బడి చేరేవాడు తను. వారం రోజులు తనను బాగా చూచేవాడు అయ్యవారు. పలకమీద 'అ ఆ' రాసిచ్చి దిద్దమనేవాడు. వారం అయినా తనకు ఆ రెండక్షరాలు చూడకుండా రాయడం రాలేదు. ఆ వేళ, అయ్యవారికి కోపమొచ్చింది. అరచేతిని త్రిప్పి పట్టమని - మెటికలమీద రూళ్ళకఱ్ఱతో వొక్క-టేశాడు. తన ప్రాణం జివ్వుమంది. వొళ్లు ఝల్లుమంది. అదే తన వొంటిమీద పడ్డ మొట్టమొదటి దెబ్బ, తన మనస్సుకు గాయమైపోయింది. మరో నెలరోజులు గడిచే సరికి తన మనస్సు విరిగిపోయింది. ఆ నెలలో జరిగిన రెండు సంఘటనలూ - తనకు తలపుకొస్తే - ఈనాటికీ వొళ్ళు జలదరిస్తుంది.

ఒక రోజు బళ్లో అయ్యవారు నాలుగో తరగతి పిల్లలకి పాఠం చెపుతున్నాడు. చంద్రమౌళి - అనే ఓ కుర్రాడ్ని ఏదో ప్రశ్న అడిగేడు. ఆ కుర్రాడికి సమాధానం రాలేదు. అయ్యవారు చిర్రుబుర్రులాడుతూ - వాడికి చింతబరికెతో నాలుగు అంటించి గోడకుర్చీ వెయ్యమని దండన విధించాడు. గదిలో ఓ మూలకి పోయి గోడకుర్చీ వేసి పుస్తకం వేపు చూస్తూ నించున్నాడు చంద్రమౌళి. బడి వున్న ఇల్లంతా చవిటిగోడలమయం; పైన రెల్లుకప్పు.

పాఠాల గోడులో పడ్డారు అందరూ.

ఉన్నట్టుండి పొలికేక పెట్టాడు చంద్రమౌళి. "చచ్చాను బాబోయ్, పిర్రకేదో పొడిచింది" అని.

అందరూ వాడికేసి చూసారు. అయ్యవారు నెమ్మదిగా వాడి దగ్గరికెళ్ళి- "ఏరా - ఏవిటి ? వేషాలేస్తున్నావ్ - వెధవా, నీ తెలివి నాదగ్గర చూపకు. బడి వదిలేదాక గోడకుర్చీ తప్పదు, నోరెత్తావంటే చంపేస్తా"నంటూ మరో రెండు దెబ్బలు అంటించి వాణ్ణి మళ్ళీ గోడకుర్చీ వేయించి ఇవతలికి వచ్చాడు.

చంద్రమౌళి కళ్ళవెంట నీరు ధారగా కారుతున్నై. అతను సరిగా నిలబడలేకపోతున్నాడు. పదినిమిషాలు కూడా కాలేదు. అతను వున్నపళాన గోడవారగా పడిపోయాడు.

అయ్యవారు అప్పుడు తేరుకున్నారు. నిజంగానే ఏదో కుట్టివుంటుందనిపించింది. హడావిడిగా చంద్రమౌళిని వాళ్ళ ఇంటికి చేర్చేరు. జరిగినదేవిటో చెప్పలేకపోయారు.

చంద్రమౌళి తండ్రికి నలుగురు ఆడపిల్లల తర్వాత - ఒక్కడే మగబిడ్డ.

ఆయనకు నాలుగెకరాల వ్యవసాయం వుంది. చంద్రమౌళిని అరచేతిలో నిమ్మపండులా పెంచుకుంటున్నాడు.

ఉరుకులు పరుగులతో చంద్రమౌళిని డాక్టర్ దగ్గరికి తీసికొని వెళ్ళారు. ఆసరికే చంద్రమౌళి చచ్చిపోయాడు.

అంతా కలలా జరిగిపోయింది. మంద్రగబ్బ కుట్టివుంటుందని కొందరూ, కాదు ఏ పామో కరచివుంటుందని కొందరూ అనుకున్నారు. ఎంత వెదికించినా ఏదీ కనిపించలేదు.

తాను ఆ మర్నాటినుండీ బడి మానేశాడు. తండ్రీ, నాయనమ్మా ఎంత చెప్పినా వినలేదు. దొరకూడా అన్నాడో రోజు - 'భయం లేదులే వెళ్ళరా వెధవా' అని. తను మొరాయించేశాడు, ఎవరేం చెప్పినా వెళ్ళనని మొండికేశాడు.

పదిరోజులతర్వాత జరిగిన మరో సంఘటన- రంగయ్యని పూర్తిగా చదువుపట్ల విముఖుణ్ణి చేసింది.

ఆ వేళ —

తండ్రికి- పొలానికి అన్నం తీసుకెళ్తున్నాడు రంగయ్య. బళ్ళోనుంచి పిల్లలంతా తిరిగొస్తున్నారు. వాళ్ళంతా చాలా సందడిగా హడావిడిగా వున్నారు. వస్తున్నవాళ్ళు లెక్కకు పదిమందికి మించి లేరు. వాళ్ళంతా దగ్గర పడేదాక దొంకవారగా నిలబడ్డాడు రంగయ్య.

వెంకటచెట్టిగారబ్బాయి కుడి కాలికీ, వేరే ఒక పెద్ద దుంగకూ కలిపి ఒక గొలుసు వేలాడుతోంది. దుంగని రెండు చేతులతోనూ ఎత్తుకొని, కుడిభుజాన పెట్టుకుని బరువుగా అడుగులు వేస్తున్నాడు అతను.

మిగిలిన పిల్లలంతా వాణ్ణి గేలిచేస్తూ - ఏడిపిస్తూ - కుడి ఎడమలా, వెనకాముందూ అల్లరి చేస్తూ నడిపించుకొస్తున్నారు.

వాళ్ళంతా తనని దాటి వెళ్తుండగా ఎవర్నో అడిగేడు, 'ఏవిట్రా ఇది?' అని. వాడు పెద్దగా నవ్వి 'బండకొయ్య' అని చెప్తూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి- నాయనమ్మ నడిగి 'బండకొయ్య' గురించిన వివరాలు తెలుసుకున్నాడు రంగయ్య. నిద్రపట్టలేదు. బండకొయ్యని మోసుకొస్తున్న పిల్లవాడి కన్నీరే రంగయ్య కళ్ళ ముందు మెదలసాగింది.

అప్పట్నించి రంగయ్యకు చదువంటే తేళ్లూ, జెర్రులూ పాకినట్లవుతుంది. 'చదువు' అనే మూడక్షరాల్ని - ఉచ్చరించినా మహాపాపం అన్నట్టు భావించసాగేడు.

ఎవరన్నా చదువుకునే పిల్లల్ని చూసినప్పుడల్లా - వారు వధ్యశిలకు కొనిపోబడుతున్న మేకపిల్లల్లా అనిపిస్తారు అతనికి.

ఊళ్ళోకి రెండు ఇంగ్లీషు కాన్వెంట్‌లు వచ్చాయి. ఆ కాన్వెంట్లో పిల్లల్ని తీసుకువెళ్ళడానికి చాలామంది రిక్షావాళ్ళు వాడుకల్ని కుదుర్చుకున్నారు. వాటిద్వారా నెలకొక 'ఇంత' మొత్తం ఒక్కసారిగా చేతికొస్తుందని వారి ఆలోచన.

రంగయ్య మాత్రం ఆ పని జోలికి పోలేదు. చదువు పట్ల అతనికున్న భావాలే దీనికి కారణం.

రంగయ్యకు ఈ ఆలోచనల్లోనే నిద్ర పట్టింది.

*  *  *

ఉదయం బారెడు పొద్దెక్కింది.

వేపచెట్టుక్రింద కూర్చొని, అప్పటికి గంటనుంచీ గమనిస్తున్నాడు రంగయ్య.

రోడ్డుకు అవతలవైపు మూడంతస్తుల భవనం ఉంది.

దానిలో ఏదో పెద్ద ఆఫీసు వుంది. ఆఫీసు దగ్గరికి పొద్దుటినుంచీ చాలా 'లాగుడుబండ్లు' వస్తున్నై. వచ్చిన కొద్ది సేపట్లోనే వచ్చినవి వచ్చినట్లే వెనక్కి వెళ్ళిపోతున్నై. కార్లూ స్కూటర్లూ వున్న ఉద్యోగులంతా అటూ యిటూ హడావిడిగా తిరుగుతున్నారు. బళ్లవాళ్లతో ఏదో మాట్లాడడం, పెద్దగా అరవడం, కేకలేసుకోవడం జరిగిపోతోంది.

మరో అర్ధగంటకి—

బండ్లు, బళ్ళ యజమానులు వెళ్ళిపోయారు.

ఆఫీసులోనుంచి ఓ బాబు వచ్చాడు.

"రిక్షా వస్తావా?" అన్నాడు రంగయ్య నుద్దేశించి.

తలకాయ ఊపి, రిక్షాతో సహా ఆఫీసు ముందుకు వచ్చేడు రంగయ్య.

అతను లోపలికి నడుస్తూ, "మా పెద్ద సార్ - మాట్లాడ తారు-రా" అన్నాడు. అనుసరించాడు రంగయ్య.

పెద్దసార్ అడిగేరు; " ఈ ఆఫీసులో వున్న రికార్డంతా గాంధీచౌక్‌లో బిల్డింగుకి చేర్చాలి. కుర్చీలూ, టేబుల్స్, రేక్‌లూ, బెంచీలూ - అవేవీ తియ్యఖ్ఖర్లేదు. కాగితాలూ, ఫైళ్లూ మాత్రమే. కావాలంటే నువ్వింకో రిక్షాఅతన్ని తెచ్చుకో. సాయంత్రంలోగా 'షిఫ్ట్' చేస్తే చాలు. ఒక్కడివే చేసుకున్నా నాకేం అభ్యంతరం లేదు. "

ఆయన ముఖంలో చిరాకూ, విసుగుదలా అస్థిమితత్వం వున్నాయి. పక్కన చేరిన ఇతర ఉద్యోగులతో అన్నాడు - " ఐ డోంట్ వాంట్ టు బి ఎక్స్‌ప్లాయిటెడ్ బై దోజ్ ఫెలోస్ " అందరివైపూ ఒకసారి చూసేడు.

ఒకరిద్దరు "యస్...యస్" అన్నారు.

"ఇతనికి రికార్డంతా చూపండి" పెద్ద సార్ ఆజ్ఞాపించారు.

కొంతమంది కదిలేరు. వాళ్ళతోపాటు రంగయ్యా కదిలేడు.

" అవసరమైతే - ఇతనికింకో నాలుగు రూపాయలు ఎక్కువ ఇవ్వండి. వీడూ ఒప్పుకోకపోతే నేనే మోస్తాను - అంతే" చాలా ధృఢంగా ఎవరితోనో చెప్తున్నాడు పెద్దసార్.

రంగయ్య విన్నాడు. ఇదేదో పట్టుదల బేరమనే విషయం అర్థమైందతనికి.

రికార్డంతా చూసుకున్నాడు రంగయ్య. చాలా వుంది. గాంధీచౌక్ మూడుమైళ్ళుంది. ఒక్కడూ తలపడితే సాయంత్రం దాకా తేలిగ్గా పడుతుంది.

"ఎంత యివ్వమంటావ్ ?" - సార్ అడిగేడు

రంగయ్య నీళ్ళు నమిలేడు. ఎంత అడగాలో నిజానికి ఆతనికి తెలీదు.

"మీ యిష్టం సార్ మీరే చెప్పండి" అన్నాడు.

ఆయనే "సరే - నేనే చెప్తాను" అని "అరవై రూపాయలు తీసుకో" అన్నాడు.

రంగయ్య కళ్ళముందు ఆరు పది రూపాయల కాగితాలు రెపరెపలాడినాయి.

"అట్టాగే సార్" అనేశాడు.

పని చకచకా సాగింది. ఉద్యోగులంతా కాగితాల్ని ఫైళ్ళనీ కట్టలు కట్టి అందివ్వడం వంటి చిన్న చిన్న పనులు సహాయం చేస్తూన్నారు రంగయ్యకి.

మొదటి "ట్రిప్" అయ్యేసరికే కాఫీలు వచ్చినై. రంగయ్యకీ ఇప్పించారు.

మధ్యాహ్నం ఒంటిగంట దాటుతోంది. అప్పటికి ఆరు సార్లు గాంధీచౌక్‌కి వెళ్ళివచ్చాడు రంగయ్య.

ఉద్యోగులంతా భోజనాలకి పోతూ రంగయ్యనీ హోటల్‌కి పిలిచేరు.

" ప్లేట్ మీల్స్" చేశాడు రంగయ్య. బిల్లుని ఉద్యోగుల్లో ఒకాయన తీసుకొని చెల్లించాడు. పెద్దసార్‌కి ఆఫీస్‌కే 'కేరియర్' వచ్చింది.

ఏడు గంటలు కావస్తోంది.

పని పూర్తిగా అయిపోయింది.

రంగయ్య ఊపిరి పీల్చుకున్నాడు.

పెద్దసార్ రంగయ్యని లోపలికి కేకేసాడు. రంగయ్య ఆయన ముందు నిలబడ్డాడు.

" అనుకున్నట్టు పని పూర్తిచేసేవ్. నాకు చాలా సంతోషంగా వుంది " అని చుట్టూ చూశాడు. ఉద్యోగ బృందమంతా ఆయన మాటల్ని సమర్థిస్తున్న మొహాలతో నిలబడ్డారు.

ఒకాయన అన్నాడు, " లారీ పెట్టి వుంటే చాలా దండగ పడి వుండేవాళ్ళం. "

" బండ్లవాళ్ళుకూడా మనల్ని తినేయాలని చూశారు." మరొకతను సన్నగా అన్నాడు.

" అందుకే - నేనీ ' ఇష్యూ 'ని ' ప్రిస్టేజ్ ' కింద భావించాను. నిజంగానే, ఈ రిక్షా అతను ఒప్పుకొని వుండకపోతే- నేను నా స్వంత కార్లో కొట్టించేసి వుండే వాణ్ణి. డ్రైవర్ లేడని ' హెజిటేట్ ' చేసే వాణ్ణి కూడా కాదు. "

ఆయన మాటల్లో ఇంగ్లీషు పదాలకి అర్థాలు తెలియలేదు రంగయ్యకి.

క్షణాలతర్వాత – ఉద్యోగుల్లో ఒకాయన – తొలిసారి రంగయ్యని పిలిచిన వ్యక్తి - పెద్దసార్‌ని ఉద్దేశించి చెప్పాడు, "మనకిప్పాళ్ళ కాఫీ టిఫిన్లకీ,, భోజనాలకీ అదీ అయిన ఖర్చంతా కలిపి 'వోచర్' తీసుకుందాం సార్."

"యస్ యస్ అలాగే చేయండి. ఐ ఎగ్రీ" అంటూ రివాల్వింగ్ ఛేర్లో గిర్రున పక్కకి తిరిగి బల్లమీది మంచినీళ్ళ గ్లాస్ తీసుకుని గటగటా త్రాగేడు పెద్దసార్.

"అయితే - నూటపాతిక రూపాయల వలభై పైసలకి రాస్తాను వోచర్" అంటూ ఏదో కాగితంమీద రాయటం మొదలు పెట్టాడు, మొదటి వ్యక్తి.

ఆ తర్వాత దానిమీద స్టాంపుని అతికించేడు. అది 'నోటు బిళ్ల' అని రంగయ్యకు తెలుసు. ఆ కాగితాన్ని రంగయ్య ముందు వుంచి "ఇక్కడ సంతకం చెయ్" అంటూ చూపేడు.

రంగయ్య మనస్సు కలుక్కుమంది; గుండెల్లో ఎక్కడో సన్నటి బెజ్జం పడింది. ఆత్మన్యూనతా భావం మొహాన దోబూచు లాడింది. క్షణంసేపు ఏదో భావ సంఘర్షణకి లోనైనట్టు ఊగిపోయాడు.

—పెద్ద దొర...

—నాయనమ్మ...

—నాయన...

—అయ్యవారు...

—వెంకటచెట్టిగారబ్బాయి...

—అందరూ కళ్ళముందు మెదిలి అదృశ్యమైనారు.

వీళ్లందర్నీ వెనక్కి నెట్టి గంగమ్మ కనిపించింది. గంగమ్మ కొంగుచాటుగా బిక్కమొహం వేసుకుని 'అయ్యా, నేబడికెల్తానే' అంటున్న హనుమంతు కోరిక కనిపించింది.

రంగయ్య కళ్లలో నీరు తిరిగింది.

ఆ ఉద్యోగికి సమాధానమేఁ వీ చెప్పకుండా, టేబుల్ మీది 'స్టాంప్ పేడ్' ని తెరచి ఎడమచేతి బొటన వ్రేలుని దాని మీద అద్ది; కాగితం మీద 'నిశానీ' వేశాడు. తలవంచుకొనే డబ్బు తీసుకున్నాడు - అరవై రూపాయలు !!

అరవై రూపాయలు తీసుకొని నూటపాతిక రూపాయల నలభై పైసలకి 'నిశానీ' వేసిన రంగయ్యని చూసి అతని దోసిట్లోని మాడంత మబ్బు ఫక్కున నవ్వింది. ఎదురుగా వేప చెట్టుకు వ్రేలాడుతున్న "కాలం మారింది" సినిమాపోస్టర్ ఆ నవ్వుతో శృతి కలిపింది.

ఏదో నిశ్చయానికి వచ్చినట్టు గబ గబా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోయాడు రంగయ్య!

ఉన్నత శిఖరాలకు దారులు వేస్తున్న ఆ అడుగుల చూపు రేపటి వెలుగు వైపు!!

ఆ వెలుగు — ఇప్పుడూ ఎప్పుడూ — "అక్షరం" !!!

000